# కళ్ళు తెరచిన కమల

రచన :
శ్రీ కలగర్ల నరసింహామూర్తి.

ఎదురింటి సీతా, గోపాలం కలసి కలకత్తా వెళ్తారట.

సీత, ఎంత అదృష్టవంతురాలు! అనుకుంది కమల.

కమల విచారంలో మునిగిపోయింది. అదేం ఖర్మమో! తన మొదటి సంతానం, బాబు పుట్టిన ఏడాదికి తనకు పాపిష్టి జబ్బు పట్టుకుంది.

అది 'క్షయ' అన్నాడు డాక్టర్.

గుండె గభేలుమంది. ఎదురుగా, అచేతనంగా నిలబడి పోయిన భర్తవంక చూసింది! అతనివదనంలో దుఃఖమూ లేదు, సంతోషమూ లేదు, దిగులూ లేదు. కానీ, ఉన్నట్టుండి, రెండు కన్నీటిచుక్కలు టప్పున, అతని నేత్రాల నుండి నేలకు రాలినాయ్.

డాక్టర్ ఏవేవో మందులు తెమ్మన్నాడు. ఇంజక్షన్లు కావాలన్నాడు. పాలు పళ్ళు బాగా ఇవ్వాలన్నాడు. ఓవల్‌టీన్ త్రాగాలన్నాడు. పైగా అతని ఫీజు. నూరు రూపాయల జీతం తెచ్చుకొనే గుమస్తా, ఇన్ని ఖర్చుల్ని ఎలా భరించగలడు? రోజూ, ఐదుగంటలకు ఆఫీసు నుండి తిరిగి ఇంటికివచ్చే భర్త, భార్యకు క్షయ అని తెలియగానే, ఆ మర్నాడునుండీ, రాత్రి ఏ తొమ్మిదీ, పదిగంటలకో గానీ ఇంటికి చేరుకొనేవాడు కాదు.

కానీ, వచ్చేటప్పుడు సంచిలో ద్రాక్షపళ్ళు, బత్తాయి, కావలసిన మందులో, ఓవల్‌టీన్ డబ్బావో, పట్టుకొచ్చేవాడు. రోజూ అర్థశేరు పాలు ఎక్స్ట్రా తెమ్మని పాలదానికి పురమాయించాడు. కమల రాత్రి పడుకోనేముందు పళ్ళు తిని, పాలు త్రాగేది. తిరిగి ఉదయం కాఫీకి బదులు పాలు త్రాగేది.

బాగా మందులు పుచ్చుకుంది. పళ్ళు ఆరగించింది. పాలు బాగా త్రాగింది. వట్టి పాలుకాదు, కోడిగుడ్డు డైట్. వంట, చాకిరి చేసుకొనే బాధకూడా లేకుండా భర్త తన తల్లిని రప్పించాడు. కమలకు కావలసినంత విశ్రాంతి లభించింది.

మూడునెలలు కాలగర్భంలో ఇట్టే కలసిపోయాయ్.

డాక్టర్ తిరిగి కమలను పరీక్షించాడు. ఆశ్చర్యంతో, ఆనందంతో కమలవంక చూసాడు. 'చాలా ఆశ్చర్యంగా ఉందమ్మాయి! మూడునెలల నాటి నీ ఆరోగ్యానికి, నేటికి ఎంతో తేడాఉంది. ఇప్పుడు నువ్వు సంపూర్ణంగా ఆరోగ్యవంతురాలైనావు. మరేం భయంలేదు. భగవంతుడు నీయందు చల్లనిచూపు చూచాడు' అన్నాడు.

కమల ఆనందంతో ఉప్పొంగి పోయి భర్తవంక చూసింది.

ఆ భర్త వదనంలో దుఃఖమూ లేదు, సంతోషమూ లేదు దిగులూ లేదు. కానీ అతని రెండు నేత్రాలలోనూ ఏదో నూతన జ్యోతిమాత్రం తళుక్కున మెరిసింది.

ఈనాడు తనుతిరిగి ఇలా ఆరోగ్యవంతురాలై, బ్రతికిందంటే, అందుకు ఎంత డబ్బు ఖర్చుఅయిందో, తనభర్త ఆ డబ్బును ఎలా తెచ్చాడో, ఆలోచించలేదు గానీ; నిత్యమూ ఇంజక్షన్లతో, తన చేతులకు కన్నాలు పొడిచారని, మందులు త్రాగించి, త్రాగించి, తన నోరంతా చేదు చేసారని వాపోయింది కమల.

కానీ, అష్టకష్టాలు పడి డబ్బుతెచ్చి, రోగాన్ని నయం చేయించిన భర్తమాత్రం, నోరు విప్పలేదు. తను రాత్రిపగలు కష్టపడుతున్నానని గానీ, బోలెడంత డబ్బు మంచినీళ్ళలా ఖర్చుఅయిందని గానీ, అతడు మాటవరసకైనా ఎన్నడూ అనలేదు.

హాయిగా ఆరోగ్యంగా ఉన్న కమల, ఎదురింటివంక చూసింది. ఎదురింటి సీత, గుమ్మంలో నిలబడి ఎవరికోసమో చూస్తున్నట్టుంది. బ్లూకలర్ ఖటావ్ వాయిల్ చీర, గులాబీరంగు నైలాన్ బ్లౌజు వేసుకుంది సీత. కాళ్లకు హైహీల్సు చెపల్సు కూడా ఉన్నాయి. మెళ్లో ఉన్న నెక్లెస్, చంద్రహారం తళతళమని మెరుస్తున్నాయ్.

కమల అనుకుంది. సీత ఎంతో అదృష్టవంతురాలు. ఆమెకు తగినభర్త లభించాడు. ఖరీదైన చీరలు తెస్తాడు, నగలు చేయిస్తాడు. ఊళ్లో విడుదలైన ప్రతీ కొత్త సినీమాకి, తనతో బాటూ భార్యను కూడా తీసికెళ్తాడు, అదికూడా రిక్షాలో కూర్చోబెట్టి. పైగా ప్రతీ ఏడూ ఏ హైదరాబాదుకో, మదరాసుకో, తిరుపతికో, ఆగ్రాకో, తీసికెళ్ళి ఊర్లూ వింతలూ చూపిస్తాడు. రెండుచేతులా డబ్బు ఖర్చుపెట్టి పెళ్ళాన్ని సంతోషపెడతాడు' అనుకుంది.

కమలకు తన జీవితంమీద, తన భర్తమీద విసుగు కలిగింది. తనభర్త తనను ఎన్నడూ రిక్షాలో కూర్చో బెట్టి, ఫస్టు క్లాసులో సినిమా చూపించలేదు. కళ్లు జిగేల్‌మనిపించే ఖరీదైన చీరలు తెచ్చిఇవ్వలేదు. నగలు సరేసరి అసలేనాస్తి, మెళ్లోని మంగళ సూత్రం తప్ప. సినిమా చూడాలంటే, ఏ పక్కింటి వాళ్ళతోనో కలసి వెళ్ళి, ఏ నేల క్లాసులోనో కూర్చొని సినిమా చూడాలి. కట్టుకోడానికి, పదిరూపాయల ముతకచీరలు తప్ప వేరే దిక్కులేదు.

ఆలా ఆలోచించుకుంటూనే, కమల వీధి గుమ్మం లోనికి వచ్చి నిల్చుంది. ఎదురింటి సీత కమలను చూసి నవ్వింది. కమలకూడా నవ్వింది.

కమల సీతను పరికించి చూసింది. 'ఏమిటో ఈమధ్య సీత బాగా చిక్కిపోతున్నట్టుంది. రోజు రోజుకీ సీత ముఖం బాగా పాలిపోతూఉంది' అనుకుంది.

'ఏం సీతా! ఏదో ప్రయాణ సన్నాహంమీద ఉన్నట్టున్నావ్! అంది కమల. సీత నీరసంగా నవ్వి అవును కమలా! ఇవాళ ఒంటిగంటబండిలో కలకత్తా వెళుతున్నాం. భోజనం చేసి సిద్ధంగా ఉండు. రిక్షాను తెస్తాను అన్నారాయన' అంది.

'అదృష్టవంతురాలివి. హాయిగా కలకత్తా పట్నం చూస్తావ్' అంటూ, కమల 'నాకా భాగ్యం లేదుకదా అని విషాదంగా ఒక్క నిట్టూర్పు విడిచింది.

'ఏం అదృష్టమో కమల? ఈ మధ్య నా ఒంట్లో బాగోలేదు. చాలా నీరసంగా ఉంది. ఎక్కడికి వెళదామన్నా బుద్ధిపుట్టదు. ఏం తిందామన్నా సయించడం లేదు. బాగా ఎండిపోతున్నానని ఆయన అంటున్నారు. ఏవేవో మందులు తెచ్చిఇచ్చారు. కానీ ఫలితం కనిపించ లేదు' అంటూ ఆగి దగ్గింది సీత.

దగ్గుతూనే ఇంట్లోనికి వెళ్ళిపోయింది సీత. ఇంతలో సీత ఇంటిదగ్గర రిక్షా ఆగింది. రిక్షాలో నుండి సీత భర్త గోపాలం దిగాడు, గోపాలాన్ని చూచి, కమల, తన ఇంట్లోనికి వెళ్ళిపోయింది. పదిహేను నిమషాలు గడచిన తర్వాత, సీతా గోపాలం కలసివచ్చి ఇంటికి తాళం వేసుకొని వచ్చి రిక్షాలో కూర్చున్నారు. రిక్షా, స్టేషను వంక పరుగుతీయడం గమనించింది కమల.

సాయంకాలం నాలుగుగంటలయింది. ఎండాకాలం కావడంచేత ఇంకా ఎండ తీవ్రంగానే ఉంది. పొద్దుటనగా వీధిలోనికి వెళ్ళిన కమల భర్త రామం అప్పుడే తిరిగివచ్చాడు. అతని ముఖమంతా చెమటతో నిండి పోయి ఉంది. మనిషి ఎండలోపడి వచ్చాడేమో, బాగా అలసిపోయాడు.

'ఆదివారం గదా, ఈ ఒక్కరోజైనా ఇంట్లో ఉండకూడదండీ! మిగతా రోజుల్లో ఎలాగూ రాత్రి పదిగంటలదాకా, ఇంటిముఖం పట్టరుగదా?' అంది కమల.

రామం, జవాబు ఇవ్వలేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

కమలకూ చిరుకోపం వచ్చింది 'నా మాటంటే, మీకు నవ్వుగానే ఉంటుందిలెండి' అంది.

రామం మాట్లాడకుండా పెరట్లోనికి వెళ్ళి, కాళ్లూ చేతులు కడుక్కొని వచ్చాడు. కమల వడ్డించింది రామం తీరుబాటుగా, తృప్తిగా భోజనం చేస్తున్నాడు. కమల ఇంకా కోపంగానే ఉంది. దాన్ని గమనించిన రామం, మజ్జిగ కలుపుకుంటూ 'నువ్వు నన్ను అపార్థం చేసుకోకు కమల కాలం వ్యర్థం చెయ్యకుండా కష్టపడితేనేగానీ, గడవని పరిస్థితులు మనవి. కష్టాలు, ఖర్చులు, ఇవన్నీ ఎంత విపరీతంగా పెరిగిపోతున్నాయో నీకు తెలుసుగా! ఇంతకుమించి, ఇంకా వివరంగా చెప్పి, నిన్ను బాధ పెట్టడం నాకు ఇష్టంలేదు' అన్నాడు.

ఆపైన అతడు మాట్లాడలేకపోయాడు. అన్నాన్ని పూర్తిగా తినకుండానే కంచంలోనే చేతులు కడుక్కొని, గదిలోనికి వెళ్ళి మంచంమీద వాలిపోయాడు.

వంటింటిలోని పనులు పూర్తి చేసుకొని, కమల గది లోనికి వెళ్ళింది. భర్త మంచంమీద నిద్రపోతున్నాడు. అతని పంచెలమీద కారిన కన్నీటిజాడలు కమలకు కనిపించినాయ్. కమల మనస్సు చివుక్కుమంది.

మూడురోజులు మామూలుగా గడచిపోయాయ్. ఆనాటి ఉదయం, కమల భర్త రామం, స్నానానికని నదికి వెళ్ళాడు. వీధిలోని కూరగాయల అమ్మి దగ్గర వంకాయలు కొని, డబ్బులకోసం భర్త జేబు తడిమింది కమల. చిల్లరడబ్బులతో పాటూ, ఏదో పెద్ద ఉత్తరం కూడా, భర్త జేబులో దొరికింది కమలకు. సహజంగా, ఒకరి ఉత్తరాలు చదివే అలవాటు లేదు కమలకు. కానీ

అది భర్త స్వయంగా ఎవరికో రాసిన ఉత్తరం కావటం చేత ఏం రాసారో చదువుదామని బుద్ధి పుట్టింది కమలకు.

'డబ్బు లియ్యండమ్మా!' అంటూ వీధిలోనుండి కూరగాయలమ్మి అరిచింది. 'ఆ! ఆ! వస్తున్నా!' అంటూ కమల ఊహాలోకంలో నుండి, భూలోకంలోనికి వచ్చి, లోనికి వెళ్ళి, కూరలమ్మికి డబ్బులు ఇచ్చేసి, తిరిగి ఇంట్లోనికి వచ్చి, ఉత్తరం విప్పి చదవసాగింది. అది, తనభర్త అతని ప్రియమిత్రుడైన ఆనంద్ కు రాసిన లేఖ.

మైడియర్ ఆనంద్ !!

నామీద నీకు ఎంతో కోపం వచ్చినట్టు, నీలేఖ నువ్వు చెప్పకనే చెప్పింది. నిన్ను కలుసుకోవాలని, నాబాధల్ని కష్టాల్ని నీతో చెప్పుకొని నా హృదయభారాన్ని కొంత తీర్చుకోవాలని, నాకు ఎంతో ఆశగాఉంది. కానీ, ఏం చేసేది? పరిస్థితుల ప్రాబల్యం వల్ల నేను పూర్తిగా చాకిరికే అంకితమైపోయాను. అనారోగ్యవంతురాలైన నా భార్యకు తిరిగి పూర్తి ఆరోగ్యం చేకూర్చాలని నా ప్రయత్నం. అందుకు బాగా డబ్బుకావాలి. నా కొచ్చే నూరురూపాయల జీతం, ఇంటి ఖర్చులకే సరిపోవడం లేదు. ఇక మందులకోసం మాదలకోసం ఏం ఖర్చు పెట్టేది? అందువల్ల నే కొంత ఎక్స్ట్రాఇన్ కంకోసం, ఇంకో రెండుషాపుల్లో పనిచేస్తున్నాను. నా చాకిరి వివరాలు:

ఉదయం ఏడుగంటలనుండి, తొమ్మిదిన్నర వరకూ, ఒక షాపులోనూ ఆ తర్వాత పదిన్నరనుండి సాయంకాలం 5 గంటలవరకూ ఆఫీసులోనూ, ఆ తర్వాత సాయంత్రం ఆరుగంటలనుండి రాత్రి 9 గంటలవరకూ ఇంకో షాపులోనూ పడి చాకిరీ చేస్తున్నాను. విశ్రాంతి లేక శరీరం హూనం ఐపోతూ ఉంది. ఆదివారం కూడా తీరుబాటు చిక్కడం లేదు.

ఆనంద్! ఒకనాటి మన మంచిదినాలు ఏనాడో మాయమైనాయి. హాయిగా సినిమాలు చూసేవాళ్లం, ఊళ్లు తిరిగేవాళ్ళం, సుఖాన్ని సంతోషాన్ని మనస్వంతం చేసుకొనేవాళ్లం. బాధ్యతలు లేక బాధలు లేక తెగిన గాలిపటంలా, విచ్చలవిడిగా విహరించేవాళ్లం. ఆ మంచి రోజులు ఇక తిరిగిరావు ఆనంద్, తిరిగిరావు. ప్రియమైన నువ్వు నాకు దూరమైపోయావ్. నాటితో సంతోషమే నాకు దూరమైపోయింది. నేడు నీ మిత్రుడు దుఃఖంతోనూ, తలకుమించిన కార్యభారంతోనూ కుమిలిపోతున్నాడు. శాంతిలేక విశ్రాంతిలేక. మనసులోనే కృంగిపోతున్నాడు. ఈ బాధపూరితమైన జీవితానికి శాంతి ఎప్పుడో! అంతమెప్పుడో!

ఆవేశంలో ఏమిటేమిటో రాసాను. అన్యధా భావించకు. నీ క్షేమసమాచారాలతో వెంటనే జవాబురాయి. నీ జాబుకోసం వేయికళ్ళతో ఎదురుచూస్తుంటాను. ఈ ఎడారిలో, అదొక్కటే ఊటబావి నాకు.

నీ రాముం!

ఉత్తరం చదవటం ముగించింది కమల. ఆమె కళ్ళు కన్నీటితో నిండిపోయాయి. 'నాకోసం ఆయన అష్టకష్టాలూ పడుతున్నారు. ఆయన్ని అపార్థం చేసుకొని, నేను మరింత బాధపెడుతున్నానేమో!' అనుకుంది కమల.

ఇంతలో ఎదురింటి గుమ్మంముందు రెండు రిక్షాలు ఆగినాయి. కమల ఆశ్చర్యంగా చూసింది. సాధారణంగా ఒకే రిక్షాలో కూర్చొని తిరిగే, గోపాలం, సీతా ఆనాడు



వేరువేరు రిక్షాలలో రావడం చూసి ఏవిటా అనుకుంది కమల.

సీత బాగా ఏడ్చిందో ఏమో; బుగ్గలమీద కన్నీటి చారలు కనిపిస్తున్నాయి. గోపాలం, ఎందువల్లనో చాలా కోపంగా ఉన్నట్టు కనిపిస్తున్నాడు. భార్యా భర్తలిద్దరూ తగువులాడుకున్నారో ఏమో అనుకుంది కమల. ఇంతలో స్నానం చేసి, రామం నదినుండి తిరిగివచ్చాడు. కమల ఇంట్లోకి వచ్చేసింది.

సాయంకాలం నాలుగుగంటలయింది. ఎవరో,వీధిలో పెద్దగా అరుస్తున్నట్లు వినిపించింది కమలకు. తొందరగా వీధి గుమ్మంలోనికి వచ్చి చూసింది కమల. ఎదురుగా కనిపించిన దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయింది. ఎదురింటి సీత వాళ్ల అరుగుమీద కూర్చొని ఏడుస్తోంది. సీత తండ్రి, ఆమెప్రక్కనే కూర్చొని సీతను ఓదారుస్తున్నాడు. కానీ అతనుకూడా బాగా ఏడ్చి, ఏడ్చి, అలసిపోయినట్టు అద్దంలా అతనిముఖమే చెబుతోంది, గోపాలం కోపంతో పిచ్చిగా అరుస్తున్నాడు.

'మావగారూ! నన్ను అనవసరంగా అల్లరి చెయ్యకండి. ఇక మీ అమ్మాయితో నేను కాపురం చెయ్యడం సాధ్యం కాదు, మీ పిల్లను మీరు తీసుకుపోండి.'

విషయం అర్థంకాక, కమల ఆశ్చర్యంతో వింటూ ఉంది. గోపాలం ఇంకా అరుస్తున్నాడు. మీ పిల్లకు టీ. బీ. అంటే క్షయ సోకిందండి. కలకత్తా డాక్టరు చెప్పాడు. అబ్బా! అబ్బా! వినడానికే భయంగా ఉంది. ఇక దానితో కాపురం చేసేదెట్లా? రేపే విడాకుల కోసం కోర్టులో ఎప్లై చేస్తా. కావలిస్తే, నెలకో పాతికో పరకో పంపుతా. ఊ! తీసుకుపోండి!'

ముసలాయన అమాంతంగా, గోపాలం కాళ్ళు పట్టుకున్నాడు.

'అంతమాట అనకు బాబూ! ఈ కష్టకాలంలో నా బిడ్డను ఇలా వదిలేస్తే దానిగతేం కాను? ఈ ఆపదసమయంలో కొడుకైనా, అల్లుడివైనా నువ్వే. నాకు వేరే సంతానం లేదు. ఆస్తిపాస్తులు లేవు. నా కన్నదల్లా నా చిట్టితల్లి ఒక్కర్తే. దాన్ని రక్షించుబాబూ! జీవితాంతం, నీకు ఋణపడి ఉంటాను.'

'నోనోనో! క్షయరోగితో, సంబంధం అసలు ఉండనే కూడదు. పోండి! వేగంగా దాన్ని తీసుకుపోండి. ఏదైనా సేనిటోరియంలోనో, హాస్పిటల్‌లోనో జాయన్ చెయ్యండి. బ్రతుకుతుందో, బుగ్గవుతుందో, అది దాని అదృష్టం.'

గోపాలం, ఇంట్లోనికి పోయి, దబాలున తలుపులు మూసుకున్నాడు. ముసలాయన పిచ్చివాడిలా, తల బాదుకుంటూ ఏడవడం ప్రారంభించాడు. వీధిలోని జనమంతా గుమికూడారు. సీత తెలివి తప్పి పడిపోయింది. విషయాన్ని విన్నవాళ్ళంతా, ప్చ్ ప్చ్, పాపం, అంటూ సానుభూతి చూపారు.

కమలకు ఇదంతా కల అనిపించింది. గోపాలం! భార్యను రిక్షాలో కూర్చోనబెట్టుకొని, ఫస్టుక్లాసులో సినిమా చూపించిన గోపాలం ఇతనేనా! వందలకొద్ది చీరలు జాకట్లు తెచ్చి భార్యను అలంకరించిన గోపాలమేనా ఇతను! భార్యకు అందల మెక్కించి, ఐశ్వర్యపు రుచి చూపించి, దేశయాత్రలు చేయించిన గోపాలమేనా, ఈనాడు భార్యను కాలదన్ని, వీధిలో పడేసినది! ఏవిటీ విచిత్రం. ఎందుకో మార్పు! ఈ గోపాలాన్ని చూచే, తాను ఆనాడు సీత ఎంతో అదృష్టవంతురాలు అనుకుంది. కానీ గోపాలంలాంటి నీచవ్యక్తిని కట్టుకున్న సీతకంటే, వేరే దురదృష్టవంతురాలు, ఈ లోకంలోనే లేదని ఈనాడు బోధపడింది.

సీత ఆరోగ్యంగా అందంగా ఉన్నంతకాలం, గోపాలం సీతను అనుభవించాడు. అనుభవించాడు - అలంకరించాడు. లోకాన్ని మోసగించాడు. సాటిస్త్రీలు, సీతను చూచి ఈర్ష్యపడేటట్టు చేసాడు.

కానీ నేడామె శరీరం కుష్కించి, ఆరోగ్యం శిధిలమైపోగానే; ఆమె తన కామాన్ని తీర్చే యంత్రంగా ఇక పనికిరాదని తెలియగానే, ఆ మహానుభావుడు ఆమెను నడివీధి పాలుచేసి, ఆమెతో తనకేం సంబంధం లేనట్టు తప్పుకున్నాడు.

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు. —సంపాదకుడు.

కమల దీనంగా రోడ్డువంక చూసింది. బాగా కండలు పెంచి వస్తాదులా ఉన్న ఒక నల్లని శరీరంగలవాడొకడు ఒక ఆవును లాక్కుపోతున్నాడు. ఆ ఆవు ఏడుస్తున్నట్టు అంబా అంభా అని అరుస్తూ, ఆ వ్యక్తితో వెళ్ళడానికి ఇష్టంలేనట్టు ఎక్కడికక్కడ ఆగిపోతూ ఉంది. రాతి శరీరంవాడు కోపంవచ్చి ములుగఱ్ఱతో, పాపం, ఆ ఆవు డొక్కలో పొడిచాడు. అంబా, అని ఆవు బాధతో అరిచింది.

'నువ్వు మనిషివా, రాక్షసుడివా! ఆ ఆవునలా ఎందుకు పొడిచి చంపుతున్నావ్! అన్నట్టు ఈ ఆవు అవధానులగారిది కదూ! ఆయనకీ సంగతి తెలిస్తే, నీ గతేమవుతుందో తెలుసా?' అంది కమల కోపంతో.

'బాగుందండోయి అమ్మగారో! ఈ ఆవును నేను ఆ అవదాన్లు బాబుదగ్గర ఇరవైరూపాయలిచ్చి కొన్నానమ్మా! ఆవు ఒట్టిపోయిందని, నాకీ ఆవును అమ్మేసినారు తల్లీ!' అన్నాడా నల్లని శరీరంవాడు.

కమల దీనంగా వాడివంక చూసి 'నువ్వీ ఆవును ఏం చేస్తావబ్బీ!' అంది.

'ఏం చేత్తాను తల్లీ' చర్మాన్ని ఒలుచుకొని, అమ్ముకుంటాను' అన్నాడు వాడు. లోకమంతా గిఱ్ఱున తిరిగినట్టయింది కమలకు. ఆమె కంటినుండి వర్షపాతంలా కన్నీరు కురవ నారంభించింది. భగవాన్! ఏమిటీ ధర్మం తండ్రీ! పాడిని ఇచ్చినంతకాలమూ ఆవు పనికి వచ్చింది. ఆ పాడి వట్టిపోగానే, ఆ పశువు ప్రాణాలనే తియ్యడానికి సంకల్పిస్తున్నారీ మానవులు. సీతకు, ఆ ఆవుకు ఏం తేడా?

కమల తన గదిలో కూర్చొని అలా ఎంతసేపు విచారించిందోగానీ, ఇంతలో వీధి తలుపులు తట్టిన శబ్దంవిని, బైటకువచ్చి వీధితలుపు తీసింది. చెమటతో నిండిపోయిన వదనంతో, రామం ఇంట్లోనికి వచ్చి కమలచేతికి సంచిని అందించి 'కమలా! సంచిలో ఓవల్టిన్ డబ్బా, టానిక్కూ పళ్ళూ ఉన్నాయి! లోనికి తీసికెళ్ళు' అన్నాడు.


కమల దుఃఖాన్ని పట్టలేక గభాలున రామంపాదాల మీద బడిపోయి తన కన్నీటితో అతని పాదాలకు అభిషేకం చేసింది. ఎన్నడూ లేంది, కమల ఈనాడు ఎందుకిలా చేసిందో, రామానికి అర్థం కాలేదు.

రామం కమలను లేవనెత్తాడు. తన సన్నని వ్రేళ్లతో ఆమె కన్నీళ్లు తుడుస్తూ 'ఏమిటిదంతా కమలా! ఎందుకలా ఏడుస్తున్నావ్! అసలే నీ ఆరోగ్యం బాగాలేదు. ఇలా ఏడిస్తే, ఎలాచెప్పు' అన్నాడు రామం.

కమల అతని గుండెమీద వాలిపోయి 'నాకేం భయం లేదండీ! మీ చల్లనినీడలో, నాకు శాంతీ, సుఖమే లభిస్తాయిగానీ, కష్టాలు ఎన్నటికి కలుగవు' అంది.

ఆమె హృదయం, ఆనందసాగరంలో తేలిపోయింది.

'పరమేశ్వరా! సిరిసంపదలు అక్కర్లేదు! నవనీత హృదయుడు, దయాసముద్రుడు, ఐన భర్తే స్త్రీకిచాలు. ఎన్నిజన్మాలకైనా, వీరినే నా పతిదేవులుగా ప్రసాదించు తండ్రీ' అంటూ కమల మనస్సులోనే భగవంతుణ్ణి ప్రార్థించింది.




## కథాంజలి

[చక్కని కథల మాసపత్రిక]

స్థాపితము 1938.

*

విడి ప్రతి, — 25 న. పై.

సంవత్సర చందా. — రూ. 4-00

(ప్రత్యేక సంచికలతో సహా)

అన్ని హిగ్గింబాథమ్స్, స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్స్‌లలోనూ దొరుకును.